క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: వరంగల్‌లోని మామూనూరు 11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వరంగల్ డీఈ ఎస్.మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మామూనూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గణేష్‌నగర్, జూనియర్ కళాశాల, వసంతపూర్ రోడ్డు, మామూనూరు, కుమారపల్లి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. రాజ్‌పుత్‌వాడలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ డీఈఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలకు అండగా ఎర్రజెండా

న్యూశాయంపేట: పేదల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా ఎల్లప్పుడు అండగా ఉంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య అన్నారు. పార్టీ హనుమకొండ కార్యాలయంలో జిల్లా మహాసభ నారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను కాంగ్రెస్ పక్కన పెట్టి అరకొర హామీలను అమలు చేసి సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ భావాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గొడుగు వెంకట్, సారంపల్లి లక్ష్మి, కడారి సుదర్శన్, రవి, అరుణ, నాయకులు పాల్గొన్నారు.

రుణ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట: రుణ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రినగర్ కాలనీలో కాలనీవాసులతో ఆయన ఆదివారం మాట్లాడుతూ ఇటీవల రుణ యాప్‌లను ఆశ్రయించిన పలువురు సకాలంలో తిరిగి చెల్లించకపోవడంతో ఏజెంట్ల ఒత్తిడికి వారు గురవుతున్నట్లు చెప్పారు. ఇలాంటి యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లించకపోయినా, ఏజెంట్లు ఒత్తిడి చేసినా, బెదిరించినా తమకు సమాచారం అందించాలని కోరారు. ప్రతికాలనీలో పది సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనుమానితులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



రామన్నపేట: యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నగరంలోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టేట్ స్ట్రీట్ కంపెనీ ఉద్యోగులు స్కూల్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలోని గోడలకు పెయింటింగ్‌లు వేసి పిల్లలకు డెవలప్‌మెంట్ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ స్ట్రీట్ కంపెనీ వలంటీర్లు హరీశ్, నిరుపమ, రాహుల్, యూత్ ఫర్ సేవ కోఆర్డినేటర్లు సునీల్, మల్లికార్జున్, విశాల్, రాజు, సునీత, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



ఖిలా వరంగల్: వరంగల్ నర్సంపేట మండలం మహేశ్వరం శివాని పబ్లిక్ స్కూల్‌లో వరంగల్ విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు జరిగిన సైన్స్ ఫెయిర్‌లో ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి రాచర్ల అర్జున్ ప్రదర్శించిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈమేరకు వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో అర్జున్‌ను తాళ్ల పద్మావతి చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వరుణ్, వైష్ణవి, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ ఆదివారం అభినందించారు.

బీసీ రుణాలు మంజూరు చేయాలి



కాజీపేట: బీసీ కార్పొరేషన్‌కు సరిపడా నిధులు మంజూరు చేసి యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్, నూతనకంటి ఆనందం పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా ఆటోల నిలిపివేత



కాజీపేట చౌరస్తాలో ప్రధాన రహదారిపైనే ఆగిన ఆటోలు



- రహదారులపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆటో డ్రైవర్లు

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో కొందరు ఆటో డ్రైవర్లు అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి వేస్తుండటంతో కాలినడకన వెళ్లే వారితో పాటు ఇతర వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోనే బీటు కానిస్టేబుళ్లున్నా పట్టించుకోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్దేశిత పార్కింగ్ స్థలంలో ఆటోలను నిలపాల్సి ఉండగా డ్రైవర్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఫాతిమానగర్, సోమిడి రోడ్డు, రైల్వే జంక్షన్ల నుంచి వచ్చే ఆటోలను ప్రధాన రహదారిపైనే నిలిపివేస్తున్నారు. దీంతో రోడ్డు దాటే క్రమంలో పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. పోలీసులు ఈ-చలాన్ల విధింపును ఆపి ఆటోల అనధికారిక పార్కింగ్‌పై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కాశిబుగ్గ శివాలయంలో మహా లింగార్చన



కాశిబుగ్గ: పూజలు చేస్తున్న భక్తులు



చైతన్యపురి కాలనీలో ముగింపు వేడుకల్లో..

వరంగల్: కార్తీకమాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మహాన్యాస పూర్వక మృతిక మహాలింగర్చన (365)రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు గుండేటి రజినీకుమార్, మార్త సందీప్‌శాస్త్రి, అంకం కల్యాణ్, మార్త మోహన్, పెద్దూరి శ్రీనివాసులు, పోరండ్ల శివ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అలయ ఈఓ వెంకట్రావు, పోలోజు రవి, మొటం శ్రీను, శ్రీరాముల పెద్దన్న, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసోత్సవాలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవ వేడుకల ముగింపు ఉత్సవాలను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో దేవతామూర్తులకు పండితులు అభిషేక, అర్చనలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసి ఆశీర్వాదం చేశారు.

కాంగ్రెస్ శ్రమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు



- కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అంకూస్

కాజీపేట: రాష్ట్ర విభజన చట్టంలో కాంగ్రెస్ పార్టీ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం పొందుపర్చడంతోనే నేడు ఆ కల సాకరమైందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి డీసీసీ అధ్యక్షుడు, నేటి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. సమావేశంలో కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, షేక్ అజ్గర్, తమ్మడి మధు మానస, మేకల ఉపేందర్, ఇప్ప శ్రీకాంత్, క్రాంతిభరత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మెపా నాయకులు

కాజీపేట అర్బన్: తెలంగాణ మలిదశ ఉద్యమ అమర వీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, రామ్మూర్తి, కనకరాజు దువ్వ, కోటేశ్వర్‌రావు, శ్రీధర్, మల్లేషం, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మెపా ఆధ్వర్యంలో..

మెపా ఆధ్వర్యంలో హనుమకొండలోని కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్‌కు నివాళులర్పించారు. కిష్టయ్య చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని మెపా వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నం రాజు, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, శ్యామ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

నయీంనగర్: కిష్టయ్య జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. అదాలత్ జంక్షన్ అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బయ్యా స్వామి, కార్యదర్శి రజనీకాంత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మల్లేశం, సోమయ్య, రాజ్‌కుమార్, నవీన్, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

వితంతువుల క్రిస్మస్ వేడుకలు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని పునీత్ ఆంథోనీ చర్చిలో వితంతువుల క్రిస్మస్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈమేరకు వితంతువులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ జేరోమ్ మాట్లాడుతూ భర్తలు కోల్పోయిన మహిళలు ఆదరాభిమానాలు తగ్గి, అనేక బాధలకు గురవుతున్నారని, వారిని ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో కరుణాపురం ఫాదర్ భాస్కర్ అనీన్, సంఘం అధ్యక్షుడు దోమ కుమార్, పసుల దాస్, మంద కిశోర్ బొక్క ప్రసాద్, దోమ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హలో బీసీ.. చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ


కేయూ క్యాంపస్: బీసీల డిమాండ్ల సాధనకు ఈనెల 5న మహా ధర్నా, 6న ఢిల్లీలో అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించనున్న హలో బీసీ.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడ బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ అరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. బీసీ జనగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

కేయూ రీసెర్చ్ స్కాలర్స్ బండి నాగరాజు గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, అభిరామ్, బి.నాగరాజు, కేయూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుదగాని మధు గౌడ్, బాధ్యులు వంశీ, శ్రీనివాస్, జగదీష్, సన్నీ, మురళి, రోహిత్, వెంకటేష్, శ్రీధర్, నితిన్, మహేష్, శివాజీ, మహేందర్, పృథ్వీ పాల్గొన్నారు.

అసోసియేషన్ బలోపేతానికి కృషి చేయాలి




అజీజ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్(టీఎస్ – మేసా) బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోఫిఖుర్ – రహమాన్ పిలుపునిచ్చారు. హనుమకొండ ములుగురోడ్డు ఎంసీసీ సెంటర్‌లో టీఎస్ – మేసా వరంగల్ జిల్లా అధ్యక్షుడు, దుగ్గొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎంఏ.అజీజ్ ఇటీవల పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈమేరకు వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా జమీల్‌పాషా, అధ్యక్షుడిగా నజీరుద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబిద్, ఉపాధ్యక్షులుగా అలీం జాహెద్, ఘయాసుద్దీన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ నన్నేసాహెబ్, వర్కింగ్ అధ్యక్షుడిగా కౌసర్ ఫారూఖీ, ప్రధాన కార్యదర్శిగా ఎం.గౌస్‌పాషాను ఎన్నుకున్నారు.

విరమణ ఉద్యోగానికే.. వయస్సుకు కాదు



కుమారస్వామిని సన్మానిస్తున్న సభ్యులు



సర్వర్ దంపతులను సన్మానిస్తున్న పూజ, తదితరులు

హసన్‌పర్తి: పదవీ విరమణ ఉద్యోగానికే కానీ, వయసు కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆర్ అండ్‌బీలో 37 ఏళ్ల పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన గోపరాజు కుమారస్వామి అంజనీపుత్ర సహకార సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ సహకార సంఘం ప్రతిష్టతకు పాటుపడాలన్నారు. సభ్యులు టి.కుమారస్వామి, కుమారస్వామి, గణేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైకి సత్కారం

మామునూరు: మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సర్వర్ పదవీ విరమణ పొందారు. పోలీస్ శిక్షణ కళాశాలలో సర్వర్ దంపతులకు ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ కల్పనరెడ్డి, డీఎస్పీ రవీందర్, భిక్షపతి, వెంకటేశ్వర్లు, ఆర్ఐ మహేష్, చంద్రశేఖర్, సుధాకర్, వడ్డె నరేష్‌కుమార్, పీఆర్ఓ రామచారి, దశరథం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పచ్చని చెట్లను కాపాడుకోవాలి

కాజీపేట అర్బన్: పర్యావరణానికి తోడ్పడే పచ్చని చెట్లను కాపాడుకోవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ కోరారు. హంటర్‌రోడ్డు నుంచి అదాలత్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు అడ్వటైజ్‌మెంట్ బోర్డులను ఏర్పాటు చేసేందుకు మొలలు కొట్టడంతో అవి చనిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఆ మొలలను ఆదివారం తొలగించినట్లు ఆయన తెలిపారు. చెట్లకు మొలలు కొట్టి అడ్వటైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసే వారిపై ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ కుటుంబానికి ఆప్తుడు శ్రీనివాసరెడ్డి

కాజీపేట అర్బన్: 60 లక్షల బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు శ్రీనివాసరెడ్డి ఆప్తుడని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రశంసించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డిని కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట 20 ఏళ్లు నడిచి తొలి, మలిదశ ఉద్యమకారుడిగా చరిత్రలో తన ప్రత్యేకతను ఓరుగల్లు బిడ్డ శ్రీనివాసరెడ్డి చాటుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే ఎన్నికల ప్రచారం

కాజీపేట రూరల్: వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ రైల్వే ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసిందని రైల్వే నాయకులు తెలిపారు. ఈనెల 4, 5, 6వ తేదీల్లో జరగనున్న రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్, ఐఆర్ఎంయూ పోటీ చేస్తున్నాయని తెలిపారు.

వాహనాల దొంగ అరెస్ట్

రామన్నపేట: వరంగల్ నగరంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాలను దొంగలిస్తున్న వ్యక్తిని మట్టెవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఎస్సై లచ్చయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న బాలరాజును తనిఖీ చేయగా ఆ బైక్ దొంగ బండిగా గుర్తించి విచారించారు. ఈక్రమంలో నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. బాలరాజును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

సరైన మార్గంలో ముందుకు సాగాలి

- ఏవీవీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసరావు

రామన్నపేట: యువత సరైన మార్గం ఎంచుకొని లక్ష్యం వైపు సాగాలని ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా 'సరైన మార్గం ఎంచుకొని : నా ఆరోగ్య నా హక్కు' అనే థీమ్‌తో కళాశాల నుంచి ఎంజీఎం ఐఎంఏ హాల్ వరకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో ఉపయోగించిన 87 ఫీట్ల రెడ్ రిబ్బన్ అందరిని ఆకర్షించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవీ పాజిటివ్ కేసులు చాపకింద నీరులా ఉధృతంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు పవన్ కల్యాణ్, రాజేష్, శివరాజ్, ఫయాజ్, దేవి శ్రీప్రసాద్, మాన్విత, నవ్యశ్రీ, మిన్ను, స్వాతి, చిరంజీవి, సాకేత్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



ప్రశంసపత్రం అందుకుంటున్న సభ్యుడు

వరల్డ్ ఎయిడ్స్ డే ర్యాలీ

హన్మకొండ కల్చరల్: హసన్‌పర్తి సూర్యోదయ మహిళా వెల్ఫేర్ సొసైటీ సౌజన్యంతో డీఎంహెచ్ఓ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎపిక్ త్రిప సొసైటీ పార్టనర్స్‌తో వంగపహాడ్ గ్రామంలో ఎయిడ్స్‌పై నివారణపై అవగాహన కలిగించి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సభ్యులకు ఐఎంఏ హాల్‌లో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ప్రశంసపత్రాలు అందజేసి సన్మానించారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



బహుమతి ప్రదానం చేస్తున్న హెచ్ఎం అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి: విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వర్ధన్నపేట (ఎంజేపీ), తిమ్మాపూర్, సాంఘిక సంక్షేమ పాఠశాల, హసన్‌పర్తి, గిరిజన సంక్షేమ పాఠశాల, దేవన్నపేట, టీఆర్ఈఐఎస్ విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హెచ్ఎం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997 – 1998వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. వారందరు పాఠశాలలో కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఏడాదికొకసారి కలుసుకోవాలని అనుకున్నారు. గురువులకు మెమోంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోదాటి నవీన్, నల్లిగంటి లక్ష్మణ్, మూసిని మధు, ఆంకాల విజయ్, మండల కిరణ్, రఘు, దుగ్యాల సుభాష్, ముద్దం వేణు, రాగి నాగరాజు చారి పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

'ప్లాటినం జూబ్లీ' ప్రత్యేకత చాటుకుంటోంది



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ చౌరస్తా: ప్లాటినం జూబ్లీ హైస్కూల్ ఏడేళ్ల క్రితం విద్యాసంస్థను ప్రారంభించి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా తయారు చేస్తూ తన ప్రత్యేతను చాటుకుంటోందని నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో 70 ఏళ్ల వేడుకల కార్యక్రమానికి నగర మేయర్ ముఖ్యఅతిథిగా ఆదివారం సాయంత్రం విచ్చేసి మాట్లాడారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబర్చాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ జగదీష్ పేచే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉత్తం చటర్జీ, ఏకేఈఎస్ఐ సీఈఓ ఫర్హాద్ మర్చంట్, హెడ్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ త్రిషసేన్, రీజినల్ హెడ్ ఇక్బాల్ సమ, కమ్యూనికేషన్ హెడ్ దినా శామ్యూల్, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, సెకండరీ సెక్షన్ హెడ్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ – ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

మామునూరు: జాతీయ రహదారిపై నిలిచిఉన్న గ్రానైట్ లారీని ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం ఉదయం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. మామునూరుకు చెందిన కందిక బాబు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజువారీగా ఉదయాన్నే ఆటో తీసుకుని ఓ ప్రయాణికురాలిని ఎక్కించుకుని వరంగల్ అండర్ బ్రిడ్జికి వైపు బయల్దేరారు. ఈ క్రమంలో నాయుడు పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న లారీని ఢీకొట్టింది. దాంతో ఆటో డ్రైవర్ బాబుకు తీవ్ర గాయాలు కాగా.. ఓ ప్రయాణికురాలికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. మృతిరాలి బంధువుల కథనం ప్రకారం వరంగల్ – నర్సంపేట రహదారిపై లేబర్‌కాలనీలోని అపోలో ఫార్మసీ వద్ద రోడ్డు దాటుతున్న దంపతులను శనివారం సాయంత్రం ఓ ఆటో ఢీకొట్టింది. దాంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్సపొందుతూ ల్యాదెళ్ల సంపూర్ణ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎన్టీఆర్‌నగర్ గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఎన్టీఆర్‌నగర్ గ్రామ అభివృద్ధి కమిటీని కమిటీ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఈర్ల రాజు, కోశాధికారిగా డాక్టర్ కర్రు రాజేందర్, ఉపాధ్యక్షులుగా బొల్లం రవి, ఓర్సు అంజయ్య, ఎల్లంశెట్టి వీరస్వామి, గౌరవ అధ్యక్షుడిగా పిట్ట నగేష్, ముఖ్య సలహాదారులుగా ఈర్ల రాజేందర్, పల్లెపాటి రమేష్‌రెడ్డి, బావండ్లపల్లి కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ల్యాగాల భిక్షపతి, అర్మూర్ కుమార్, చెరుకు హరిబాబు, ఆర్గనైజర్లుగా జక్కుల ప్రశాంత్, సారంగం, కార్యవర్గ సభ్యులుగా వినయ్, పూర్ణచందర్, భరత్ ఎన్నికయ్యారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా సుధాకర్

దేశాయిపేట: ముదిరాజ్ సంఘం దేశాయిపేట గ్రామ అధ్యక్షుడిగా విప్ప సుధాకర్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేశాయిపేటలోని సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఓరుగల్లు అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్రం, ఓరుగల్లు అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. హంటర్ రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్ ఆధ్వర్యంలో మడికొండకు చెందిన కొప్పిరాల శైలశ్రీ పటేల్‌తో పాటు 20 మంది మహిళలు ఆదివారం బీజేపీలో చేశారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి రావు పద్మ ఆహ్వానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోలను సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, రమేష్, సంపత్‌రెడ్డి, అరణ్యారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామంలో ఆరవ్ పాలి క్లినిక్ వైద్యుడు బి.రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట: నగరంలోని 36 డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ డిమాండ్ చేసారు. ఈమేరకు డివిజన్‌లో ఆదివారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు శ్రీధర్, నవీన్, ఎల్ల య్య, రాజు, జంపయ్య, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శివ, రామబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ

హసన్‌పర్తి: కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డిని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఇటీవల నర్సింహారెడ్డి తల్లి సొదామని అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఓదార్చారు. కడియం వెంట టీపీసీసీ సభ్యుడు లింగా జగదీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రత్నాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధన్‌గౌడ్, భగత్, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ తదితరులు ఉన్నారు.

సింహగర్జనకు తరలిన మాలలు

మడికొండ: మాలల సింహగర్జనకు మడికొండ నుంచి అంబేడ్కర్ సంఘం నుంచి సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌కు బయలుదేరారు. తరలిన వారిలో సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, జానపట్ల సారయ్య, బందెల రాజ్‌కుమార్, ముప్పిడి రాజు, ఈద రమేష్, కట్ట రాజ్‌కుమార్, బాబు ఉన్నారు.

బాపూజీనగర్ నుంచి..

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ సెంటర్ కడిపికొండ బ్రిడ్జి వద్ద నుంచి మాలల సింహగర్జనకు తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌కుమార్, గోవర్ధన్, కొమ్మాలు, కోండ్ర నర్సింగరావు, కాందారి రాజమోగిలి, కుమారస్వామి, జంగం బాబురావు, తదితరులు ఉన్నారు.